క్లుప్తంగా

ప్రతి గ్రామంలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తాం



ఐమాక్స్ లైట్ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అన్నారు. జెడ్పీ నిధుల ద్వారా మంజూరైన ఐమాక్స్ లైట్లను పిల్లోడి గ్రామంలో బసవేశ్వర విగ్రహం సమీపంలో శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, చీలపల్లి సర్పంచ్ వీరన్నపాటిల్, రైతుబంధు అధ్యక్షులు పరశురాంగౌడ్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, నాగేశ్, సమ్మయ్య, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటా



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో ఎవరూ ఇబ్బందుల్లో ఉన్నా వారికి అండగా ఉంటానని చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన రూపేరావు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో శనివారం నీలం మధు ఆయనను పరామర్శించారు. అనంతరం స్థానిక దేవాలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. శనివారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, రాంగ్‌రూట్‌లో, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. అదేవిధంగా అపరిచితులకు ఫోన్‌లో వ్యక్తిగత వివరాలు తెలపకూడదన్నారు.

బాలల హక్కులపై అవగాహన

మునిపల్లి(అందోల్): బాల, బాలికల హక్కులను కాపాడాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌లైన్ టీం సభ్యులు స్రవంతి అన్నారు. శనివారం మండలంలోని పెద్దగోపులారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల బాలికల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కీర్తికుమారి, ఎంపీటీసీ బుర్కల పాండు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త (టీచర్) మంజుల తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన

నారాయణఖేడ్: షీ టీంపై నారాయణఖేడ్ పట్టణంలోని నారాయణి షాపింగ్ మాల్‌లో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ మొగులయ్య, హెడ్ కానిస్టేబుల్ మారుతి, కానిస్టేబుల్ హరి మాట్లాడుతూ మహిళలపై ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అప్పారావు షెట్కార్‌కు నివాళి

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే అప్పారావు షెట్కార్ వర్ధతిని శనివారం నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని అప్పారావుషెట్కార్ విగ్రహానికి ఆయన కుమారుడైన మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మనవడు అభిషేక్ షెట్కార్‌తో పాటు నాయకులు కోటగిరి సత్యనారాయణ, విక్రం తదితరులు షెట్కార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అప్పారావుషెట్కార్ దేశ స్వాతంత్య్రం కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, ఖేడ్‌కు మొదటి ఎమ్మెల్యేగా వరుసగా రెండు పర్యాయాలు గెలిచి ఆయన ఈ ప్రాంత వాసులకు ఎన్నో సేవలను అందించారని కొనియాడారు.

పాడి రైతులకు చేయూత

జోగిపేట(అందోల్): విజయపాల ఉత్పత్తిదారులకు తెలంగాణ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య అన్ని విధాలుగా చేయూతనందిస్తోందని పుల్కల్ పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ రంజిత్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన పాడిరైతులు మొగులయ్య కూతురు నాగరాణి వివాహం ఇటీవల జరిగింది. అదే గ్రామానికి చెందిన దుదేకుల రుక్మొద్దీన్ కుమారుడు దస్తగిర్ వివాహం జరుగగా విజయ పెళ్లి కానుకగా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. జోగిపేట బీఎంసీయూ ఇన్‌చార్జి నిఖిత, సూపర్‌వైజర్ ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం.. నందనవనం



రామచంద్రాపురం పట్టణంలోని శ్రీసాయినగర్ కాలనీ థీమ్ పార్కు

- ఆకర్షణీయంగా థీమ్ పార్కులు
- ఎమ్మెల్యే సహకారంతో ప్రత్యేక చర్యలు
- అన్ని హంగులతో అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్‌లలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో పార్కుల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పార్కులు లేకపోవడంతో స్థానికులు 5కిలోమీటర్ల దూరంలోని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌కు వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్‌లు అన్ని కాలనీలలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రధానంగా మూడు జీహెచ్ఎంసీ డివిజన్‌లలో ఎక్కడాలేని విధంగా థీమ్ పార్కులను అభివృద్ధి చేశారు.

గ్రామీణ వాతావరణం తలపించే విధంగా..

రామచంద్రాపురం డివిజన్ పరిధిలో మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు శ్రీసాయినగర్ కాలనీలో రూ.3కోట్ల నిధులతో థీమ్ పార్కును అభివృద్ధి చేశారు. థీమ్ పార్కులో ప్రహారిలపై గ్రామీణ వాతావరణం తలపించే విధంగా బొమ్మలను వేసి పచ్చిగడ్డితో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. డివిజన్‌లో ఇప్పటికే నాలుగు, భారతి నగర్ డివిజన్‌లో 20 పార్కులను అభివృద్ధి చేశారు. అందులో పాత ఎంఐజీ కాలనీలో రూ.1.76లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్న థీమ్ పార్కులలో చిన్నారుల ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్, సైకిలింగ్ ట్రాక్, పూలమొక్కలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. అదేవిధంగా పటాన్‌చెరు పట్టణంలో గాంధీ థీమ్ పార్కును అభివృద్ధి చేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



ప్రజల కోరిక మేరకు మూడు డివిజన్‌లలో థీమ్ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో థీమ్‌పార్కుల పనులను పూర్తి చేశాం. మరికొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయ్యే దశల ఉన్నాయి. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పార్కులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

– మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు రూపశ్రీ కౌంటి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇప్పటికే సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మిషన్ భగీరథ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రకళగోపాల్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం అందజేత..

ఇటీవల మండల పరిధిలోని రుద్రారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిట్కుల్ గ్రామానికి చెందిన పలువురు బాధితులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అండగా నిలిచారు. వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బుచ్చయ్య, రామయ్య, దుర్గయ్య, లింగయ్య, గోపాల్, నిఖిల్, స్వరూప, భారతమ్మ, అమృత, లింగయ్య, లలిత తదితరులకు రూ.4లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు పటాన్‌చెరు మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి స్వయంగా ఆస్పత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే సహాయ సహకారాలతో పాటు ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో ఆదుకుంటామని భరోసా కల్పించారు.

అందోల్ చెరువు సుందరీకరణకు రూ.2.55 కోట్లు



జోగిపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువు సుందరీకరణకు ప్రభుత్వం ద్వారా రూ.2.55 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం చెరువు కట్ట వద్ద ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్, బటర్‌ఫ్లయి లైట్లు, పార్కు, ఓపెన్‌జిమ్ వంటి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి కృషి చేస్తోందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందోల్ అభివృద్ధికి కృషి చేస్తాం

సంగారెడ్డి మున్సిపాలిటీ: అందోల్ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే క్రాంతికిరణ్, నియోజకవర్గ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం చౌటకుర్ మండలం ఆత్మీయ సమ్మేళనం సరాఫ్‌పల్లి సీపీఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ తొమ్మిది ఏళ్లకు ముందు గ్రామాలు ఏవిధంగా ఉండే ఇప్పుడు ఏవిధంగా ఉన్నాయో ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎంపీపీ చైతన్యరెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల వీరేందర్, మసాన్‌పల్లి నారాయణ, పల్లె సంజీవయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిష్టారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తులు ధ్వంసం చేస్తే జరిమానా

జోగిపేట(అందోల్): గ్రామంలో మంచినీటి సరఫరాకు సంబంధించి ప్యానల్ బోర్డును పగలగొట్టి మోటార్లు వేసి నష్టం చేకూరిస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని సర్పంచ్ రాణిఅశోక్ హెచ్చరించారు. మండలం పరిధిలోని మాసానిపల్లిలో శనివారం నుంచి గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేస్తున్నందునా మోటార్లు నడిచినప్పుడే నీళ్లు పట్టుకోవాలని, ఎవరికి వారు వేసినట్లయితే గ్రామ పంచాయతీ పెద్ద సమక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ గ్రామానికి చెందిన గ్రూపులో సర్పంచ్ పోస్టు చేశారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు బోర్డును పగలగొట్టి మోటారును తగులబెట్టారన్నారు. గ్రామ పంచాయతీకి చెందిన బోర్డులను పగలగొట్టడం సరైంది కాదన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలి

మునిపల్లి(అందోల్): అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని బుస్సారెడ్డిపల్లి సర్పంచ్ స్వప్నశశికుమార్, ఎంపీటీసీ శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామంలో ఆత్మీయ సమ్మేళన సన్నాహాక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, మైనార్టీ మండల నాయకులు హఫీజ్, గ్రామశాఖ అధ్యక్షులు నరసింహ్మారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో శనివారం బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు, చిన్నారులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, కోఆప్షన్ సభ్యులు అంబదాస్, అభిషేక్ షెట్కార్ పాల్గొన్నారు. అనంతరం వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయించడాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో డివిజన్ పరిధిలోని వీఆర్ఏలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు.

ఉదయ్‌జైన్‌పై కేసులు నమోదు

సదాశివపేట(సంగారెడ్డి): నకిలీ పత్తి విత్తనాలు, కాలపరిమితి ముగిసిన క్రిమిసంహారక మందులు నిల్వచేయడమే కాకుండా రైతులకు విక్రయిస్తున్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ జైన్‌పై శనివారం మండల వ్యవసాయ అధికారి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఆత్మకూర్, పొట్టిపల్లి గ్రామాల శివారులోని గొడౌన్స్ లో అనధికారికంగా నకిలీ పత్తి విత్తనాలు కాలపరిమితి ముగిసిన క్రిమిసంహారక మందులు నిల్వఉంచి రైతులకు విక్రయించి నష్టం కలిగించాడని ఆయన తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జంలా తండాలో కంటివెలుగు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేట జంలా తండాలో శుక్రవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. 204 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని సిర్గాపూర్ పీహెచ్‌సి డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు అరవింద్, పీహెచ్ఎన్ నిర్మల, సిబ్బంది సరిత పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి నగదు రివార్డులు



నగదు రివార్డును అందజేస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: గత నెలలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను అభినందిస్తూ శనివారం నారాయణఖేడ్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య నగదు రివార్డులను అందజేశారు. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, సూపర్ లగ్జరీ బస్సులకు సంబంధించి ఒక్కో డ్రైవర్‌కు రూ.800, ఇద్దరు చొప్పున కండక్టర్లకు రూ.600, రూ.400 రివార్డులను అందజేశారు. రివార్డులు అందుకున్న వారిలో డ్రైవర్లు వెంకట్‌నాయక్, వెంకయ్య, రాములు, కండక్టర్లు నాగభూషణం, బేతయ్య, దుర్గయ్య, విఠల్, సాయిలు, వీరయ్య ఉన్నారు. ప్రస్తుతం డిపో రూ.11.50లక్షల లాభాల్లో ఉందని డీఎం తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజరు ప్రవీణ్‌కుమార్, ఎంఎఫ్ దశరథ్, పీఆర్వో పాండు, సేఫ్టీడ్రైవర్ శరణయ్యస్వామి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు పాత సామాన్లు ఇవ్వండి



ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

పటాన్‌చెరు: పాత సామాన్లను పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాల వద్ద ఇవ్వాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో 'మేరీలైఫ్– మేరా షహర్' జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) సెంటర్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పాత పేపర్లు, తదితర పరికరాలను ట్రిపుల్ ఆర్ కేంద్రాల్లో ఇవ్వవచ్చని చైర్మన్ సూచించారు. మున్సిపల్ ఆర్‌వో వెంకటరామయ్య, కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: మేరా లైఫ్ మేరా స్వచ్ఛ శహర్ కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ పట్టణంలో రెడ్యూస్, రీసైకిల్, రియూజ్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉందాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదలకు అండగా ఉండాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలో రీసైకిల్ రియూస్ రెడ్యూస్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇళ్లలలో ఉండే పాత దుస్తులు, వస్తువులు, పరికరాలను సేకరించి వాటిని రీసైకిలింగ్ చేసి అవసరమైన పేదలకు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉపకమిషనర్ బాలయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలూరి గోవింద్, సీనియర్ నాయకులు బూరుగడ్డ నగేష్, వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్‌పై అవగాహన

నారాయణఖేడ్: వచ్చే నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం సిబ్బందికి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల విషయంలో రాజకీయం తగదు



మాట్లాడుతున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో కౌన్సిలర్‌లు కాలనీ సొసైటీ వారు ఏం చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసు అని కౌన్సిలర్ లచ్చిరాంనాయక్ అన్నారు. శనివారం విద్యుత్‌నగర్ కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వ్యాప్తంగా మున్సిపాటిలీలలో ఇంటిపన్నులు పెరిగి ఎండ్లు గడుస్తుంటే దానిని ఇప్పుడు కొంతమంది రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంటిపన్ను విషయంలో పక్క మున్సిపాలిటీతో పోల్చితే చాలా వెనకబడి ఉన్నామని తెలిపారు. తాము చేసిన పనులను ప్రజలకు చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. సమావేశంలో కౌన్సిలర్ బాలజీ, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, శేఖర్, రవి, నరేందర్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పన్నులు వసూలు చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలో పాత పద్ధతిలోనే ఇంటి పన్నులు వసూలు చేయాలని విద్యుత్‌నగర్ కాలనీ సొసైటీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకులు గుండాల ముకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులను వసూలు చేస్తున్నారని వివరించారు. ఇక్కడ ఏవిధంగా ఇంటి పన్నును పెంచారో చెప్పలేని పరిస్థితిలో ఇక్కడి మున్సిపల్ అధికారులున్నారని తెలిపారు.

జోగినాథ కాలనీలో దొంగల హల్‌చల్

జోగిపేట(అందోల్): జోగిపేటలోని జోగినాథ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు హల్‌చల్ చేశారు. వట్‌పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సాయిబాబ ఇంట్లోకి ప్రవేశించి రెండు తులాల బంగారం, రూ.75వేల నగదును పెట్టెతో పాటు ఎత్తుకెళ్లారు. అదేరోజు రాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శంకర్‌నాయక్ ఇంటి తలుపులు పగలగొట్టడానికి విఫలయత్నం చేశారు. విద్యాసాగర్ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఒక కానిస్టేబుల్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. ఇదే కాలనీలో అద్దెకు ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. సాయిబాబ ఇంట్లో నుంచి ఎత్తుకెళ్లిన పెట్టెను ఎన్టీఆర్ స్టేడియం పక్కన వదిలిపెట్టి పోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సామ్యానాయక్ తెలిపారు.

పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): తన సొంత భూమిలో పంటను సాగు చేస్తుంటే కొంతమంది వ్యక్తులు అకారణంగా పంటను నాశనం చేశారని, ఇందుకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలలోకి వెళ్తే.. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన సందుకారి రుక్మారెడ్డి తన భూమిలో టమాటా పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతమంది వ్యక్తులు పంటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడమే కాకుండా తనపై దురుసుగా మాట్లాడుతున్నారని వాపోయాడు. పోలీసులు స్పందించి అకారణంగా పంటను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని రుక్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకృష్ణ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు కరెంట్ సరఫరాకు అంతరాయం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని ట్రాన్స్‌కో ఏడీఏ మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందునా జహీరాబాద్ టౌన్, అల్గోల్, దిడ్గి, కోత్తూర్(బి) రంజోల్, హుగ్గెల్లి గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

◆ ఉచిత పశువైద్య శిబిరం

నారాయణఖేడ్: మండల పరిధిలోని పోతన్‌పల్లి (ఎం)లో శనివారం పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాక్సినేషన్, డీవార్మింగ్, సుడి పరీక్షలను నిర్వహించారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులను పాడి రైతులకు విజయాడైరీ తరపున ఖేడ్ పాలశీథలీకరణ కేంద్రం మేనేజర్ రాములు అందజేశారు. అనంతరం వేసవికాలంలో పాలు సేకరించే విధానం, నాణ్యతకు సంబంధించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ నగేష్, విజయాడైరీ ఫీల్డ్ అసిస్టెంట్ సంగారెడ్డి, ప్రకాష్, గోపాలమిత్ర సునీల్ పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న విచారణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ అనుమతులు, లైసెన్స్ లేకుండా నకిలీ పురుగుల మందులు, విత్తనాలు విక్రయిస్తున్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన వ్యాపారి ఉదయ్‌కుమార్ జైన్ దుకాణంపై ఇటీవల పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేసిన విషయం విదితమే. సోదాల్లో దొరికిన రూ.కోటి పైచిలుకు నకిలీ పురుగుల మందులు, విత్తనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అధికారులు శనివారం వీటిపై లోతుగా విచారణను ప్రారంభించారు. కాగా చిన్నపిల్లలు తినే తినుబండారాలతో సైతం పురుగుల మందులు తయారు చేస్తున్నట్లు అనుమానాలు రావడంతో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు గ్రామానికి వెళ్లగా సదరు వ్యాపారి దుకాణానికి తాళాలు వేసి ఉండటంతో అధికారులు వెనుదిరిగారు.

◆ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

జహీరాబాద్ టౌన్: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ రమేష్‌బాబు సూచించారు. పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో శనివారం బూత్‌లెవల్ స్థాయి, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ యువత ఓటు హక్కు నమోదుకు అధికారులు సహకరించాలన్నారు. ఓటు జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ స్వామి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

◆ నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

జహీరాబాద్: మొగుడంపల్లి మండలం జాడీమల్కాపూర్ గ్రామంలోని దుర్గాభవానీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈ నెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

◆ ఏపీఎస్ఎస్ అధ్యక్షుడిగా కర్ర రమేష్

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవాసమితి నారాయణఖేడ్ మండల శాఖ అధ్యక్షుడిగా కర్ర రమేశ్ నియమితులయ్యారు. నారాయణఖేడ్‌లోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరి, ఉమ్మడి మెదక్ జిల్లాల అధ్యక్షులు భీంసేన నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

◆ తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేయాలి

పటాన్‌చెరు టౌన్: తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేయాలని పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బీఎల్ఓలు, సూపర్‌వేజర్లు, వివిధ పార్టీల నాయకులతో కలసి శనివారం పట్టణంలోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన (పోలింగ్ బూత్ మారిన) ఓటర్లు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునేవిధంగా బీఎల్ఓలు, సూపర్‌వేజర్లు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ మాస్టర్ ట్రేనర్ అమరేందర్‌రెడ్డి, ఏఫిక్ డీటీ సంతోష్ పాల్గొన్నారు.

◆ యువత సన్మార్గంలో నడవాలి

నారాయణఖేడ్: యువత చెడువ్యసనాల జోలికి వెళ్లకుండా సన్మార్గంలో నడవాలని అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. నారాయణఖేడ్ మండలం కొండాపూర్ స్కూల్ తండాలో జగదాంబ భవానీమాత, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, జిల్లా, డివిజన్ బాధ్యులు రాంచందర్, రఘునాథ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పంటల సాగుకు ప్రణాళికలు

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో వానాకాలం పంటల సాగు ప్రణాళికలో భాగంగా రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ ముగిసిన హరినామ సప్తహ మహోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చాల్కి గ్రామంలో విఠల్–రుక్మిణీ ఆలయంలో హరినామ సప్తహ మహోత్సవం శనివారం ముగిసింది. గత వారం రోజుల నుంచి ఆలయంలో హరినామ సప్తహా భజన, సంకీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని 33 వార్డులో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, కౌన్సిలర్ నాగరాజ్, రామప్ప, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ మొక్కలు ఎండిపోకుండా..

కంది(సంగారెడ్డి): వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలుఎండిపోకుండా చూడాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిధిలోని చిద్రుప్ప, ఆరుట్ల, బేగంపేట గ్రామాల్లోని వననర్సరీలు, పల్లె ప్రకృతి వనాలుర డంప్ యార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

◆ నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి సోమ్ము చేసుకుంటున్న దళారులు, డీలర్లపై పీడీ యాక్టు నమోదు చేయాలని నియోజకవర్గ బీజేపీ నాయకుడు శివరాజ్‌పాటిల్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ మండల పరిధిలోని అత్మకూర్, పోట్టిపల్లి గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు, పురుగు మందులను ఎలాంటి లైసెన్స్ లేకుండా తయారుచేస్తున్న అధికారులు ఎందుకు గుర్తించి నివారించలేకపోతున్నారని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు అండదండలతో నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు అమ్మి నిలువునా మోసం చేస్తున్నారన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొని బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బ్రహ్మనందరెడ్డి, అంజియాదవ్ పాల్గొన్నారు.

◆ రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

రాయికోడ్(అందోల్): కొత్తగా పట్టాపాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి అభినాష్‌వర్మ సూచించారు. ఈ నెల 22వ తేదీ నుంచి రైతులు తమ పట్టా పాసుపుస్తకం, భూ బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఆయా క్లస్టర్లలో అందుబాటులో ఉండే ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.